# కవిసేన మానిఫెస్టో - ఒక పరిశీలన

ప్రాచీన భారత అలంకారికులకు, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంత కర్తలకు, మార్క్సిస్టులకు సాహిత్యం విషయంలో 'ఆశ్చర్యకరమయిన ఖావైక్యత' వుందని, వీరందరు చెప్పినదే కవిసేన మతం గూడానని– ఇదీ ఈ మానిఫెస్టో సారాంశం. దీన్ని నిరూపించుకోవడంకోసం, ఆ అలంకారికులను సిద్ధాంత కర్తలను ముక్కలు ముక్కలుగా నరికి కొలేషన్ల పోగులు పెట్టారు. ఈ క్రమంలో ఆనందవర్ధనుడికి, ఐ. ఎ. రిచర్డ్స్‌కూ జరిగిన న్యాయమెంతో వారి వారి అభిమానులు నిర్ణయించుకోవాలి. మార్క్సిజానికి పట్టిన గతేమిటో, కవిసేన దృక్పథమేమిటో చూడడం మాత్రమే ఈ సమీక్ష వుద్దేశ్యం.

## సామాజిక చైతన్యం

'ఈ ముఖ్యమైన విషయంమీద ఆలోచనా బాణం సంధించండి' అంటూ మొదలుపెట్టి సామాజిక చైతన్యాన్ని గురించి మొదటినుండి చివరిదాక చాలా విషయాలు చెప్పారు. కాని దాని అర్థమేమిటో కూడ గ్రహించలేదు. సామాజిక చైతన్యం అంటే పక్కవాడి గురించి పట్టించుకోవడం, 'లోకం కోసం శోకం' - యివన్నీ కావు. ఒక నిర్దిష్ట భౌతిక స్వరూపం (ఉత్పత్తి విధానం) గల సమాజం తనను గురించి తాను చేసుకొనే ఊహ, ఆలోచన, దర్శనం, సామాజిక చైతన్యం. ఉత్పత్తి విధానం సమాజానికి పునాది. అది సామాజిక 'పదార్థ
చైతన్యం సామాజిక చైతన్యం. కాబట్టి సామాజిక చైతన్యమన్న మాటకు పైన చెప్పిన అర్థం యిచ్చి విశ్వనాథ సత్యనారాయణకు, అభినవ గుప్తుడికి గూడ సామాజిక చైతన్యం వుండేది, ఆధునిక కమ్యూనిస్టు రచయితలకు మాత్రమే కాదు, అని వాళ్ళను వెనకేసుకు రావడానికి శేషేంద్రపడ్డ ప్రయాస అంతా అశాస్త్రీయమూ, నిరర్థకమూను. ఎవ్వడికీ సామాజిక చైతన్యం వుండదు. తన స్వంత చైతన్యమే వుంటుంది. ఈ చైతన్యం సామాజిక చైతన్యంలో నుండి పుడ్తుంది. దీనికి ఆ వ్యక్తి అభ్యుదయ కాముకుడా ప్రగతి నిరోధకుడా అన్నదానితో సంబంధంలేదు. సమాజంలోని వైరుధ్యాలు సామాజిక చైతన్యంలో ప్రతిబింబిస్తాయి, అందుల్లోనుండి పుట్టే

వ్యక్తుల చైతన్యంలోనూ వుంటాయి. అందుచేత భరతముని కావ్యం ధర్మోపదేశం చేయాలన్నా, భామహుడు కావ్యం ధర్మాధర్మ విచక్షణ యివ్వాలన్నా, మరొకడు కావ్యప్రయోజనం విశ్వశ్రేయస్సన్నా, చూసావా! కమ్యూనిస్టులకే గాదు, మావాడికీ 'సామాజిక చైతన్యం వుంది' అనడం కాదు చేయాల్సింది. ఆ వ్యక్తుల చైతన్యం, వారి ఆలోచనలు, ఆనాటి సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబిస్తాయని తెలుసుకొని, ఆ ధర్మం ఏమిటో, సమాజంలో అది నిర్వహించే పాత్ర ఏమిటో, ఆ ఉపదేశం ఏమిటో ఎవ్వరికి చేయాలో, విశ్వశ్రేయస్సంటే ఎవరి శ్రేయస్సో — ఇవి నిర్ణయించాలి. భూస్వామ్య దోపిడీని నిలిపే ధర్మోపదేశం, ఈ విప్లవాల యుగంలో ప్రజలకు సాహిత్యం ద్వారా చేసే విప్లవ 'ఉపదేశం' ఒకటే ఎట్లా అవుతాయి?

'సామాజిక చైతన్యం' అన్న మాటను కొంతమంది అభ్యుదయ భావాలుగల యువకులు సమాజం గురించి పట్టించుకోవడం అన్న అర్థంలో వాడడం కద్దు, అదేమంత మహాపాపం కాదు. కాని తెలుగుదేశంలో మార్క్సిస్టులెవరూ 'కాపిటల్' గూడ చదవలేదని ఆరోపించి మాకు మార్క్సిజం బోధించడానికి ఉపక్రమించిన శేషేంద్రగూడ ఇంత అల్పమయిన పొరపాటు చేయడం ఆశ్చర్యకరం.

## 'కవిత్వం ఆత్మకళ'

కవిసేన సాహిత్య సిద్ధాంతానికి కీలకమయిన సూత్రం యిది. దీని అర్థం 'కవిత్వం జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం' అంటే 'మూఢునివలె జీవితంలో బుడుంగున మునిగిపోయి శవమై పైకి తేలకుండ' అనుభూతిని కళగా అభ్యసించడం, 'సచేతంగా సబుద్ధికంగా సంకల్ప సహితంగా జీవితాన్ని అచమనం చేయడం'. అంటే బాహ్యవిషయం ('జగత్తు') తనలో కలిగించే అనుభూతిని ఒక వరంగా పరిగణించి మైమరచి 'స్వకీయ ఆత్మజలాల్లో జలకాలాడడం'–ఈ మానవ సాగరంలో జలకాలాట నుండి పుట్టేది కవిత్వం.

పైగా యిదే మార్క్సిస్టు దృక్పథం కూడానట.

మార్క్సిజం అటుంచి ఈ ఆత్మీకరణ గురించి కొంచెం చెప్పుకోవాలి. 'జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం' అన్నది ప్రతి వ్యక్తికి– కవిగాని కాకపోని–

అనునిత్యం జరుగుతూనే వుంటుంది. ఎవ్వరూ జీవితంలో బుడుంగున మునిగిపోయి పైకి తేలరు. బాహ్యవిషయానికి వ్యక్తి చైతన్యానికి అన్యోన్యక్రియ నిరంతరం జరుగుతుంది. దీని ఫలితమే ఆ విషయంయొక్క ఆత్మీకరణ (ఇంగ్లీష్‌లో దీనిని Internalisation అంటారు). ఈ క్రమంలో వ్యక్తి చైతన్యం ఎంతోకొంత మారుతుంది. మనిషి వ్యక్తిత్వం (Personality) ఈ విధంగానే ఏర్పడుతుందని అందుకే దానిమీద ఆ సమాజం తాలూకు ముద్ర వుంటుందని సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్తల (Socialpsychologists) అభిప్రాయం. ఈ ఆత్మీకరణ సాధారణంగా గుప్తచేతన స్థాయిలో జరిగిపోతుంది. కాని వృత్తిని ప్రవృత్తిని సందర్భాన్ని అనుసరించి అందరికీ గూడ అప్పుడప్పుడు సచేతనంగా సబుద్ధికంగా జరుగుతుంది.

సార్వజనీనమయిన ఈ చర్యను కవులకు పరిమితం చేయడం ఒక తప్పు. దానికి తమ చాపల్యం చేర్చి ఆత్మీకరణ అంటే అనుభూతిలో జలకాలాట అని తీర్మానించడం రెండవ తప్పు. ఇదే మార్క్సిజం అని చూపించడానికి మార్క్సిస్టు రచయితల్ని వక్రీకరించడం క్షమించరాని తప్పు.

ష్చెర్బినా అనే సోవియట్ రచయిత్రి "Whereas the basic Principle of coog ition is the repetition of phenomeno.... the basic principle of art is the individualsation of phenomena" అనంటే, ఇక్కడ చెప్పిన Individualisation of Phenomena అన్నదే జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం అని తమ భాష్యం చెప్పారు. కాబట్టి మార్క్సిజం ప్రకారం కవిత్వం ఆత్మకళ అని తీర్మానించారు. అసలు ష్చెర్బినా అన్నదానికి అర్థం ఏమిటి? మాటకుమాట అనువాదం దేనికిగాని భావం చెప్పుకుందాం. బాహ్య ప్రపంచంలోని విభిన్నమయిన విషయాలలోని సామాన్యగుణాలు ఆ విషయాలను మనం (అంటే మనుష్యులేకాదు, జంతువులుగూడ) గుర్తించడానికి అర్థం చేసుకోవడానికి (guise చేయడానికి) అత్యవసరం. ఏ రెండు చెట్లు ఒక రకంగా వుండవు. కాని అన్ని చెట్లలోని 'చెట్టుత్వం' అనే సామాన్యగుణం (అన్నిచెట్లూ మొదలు వేళ్ళు కొమ్మలు ఆకులు కలిగివుండడమనే Repetition of Phenomera) వాటిని ఒక జాతిగా గుర్తించడానికి పనికివస్తుంది. ఇది నిత్యజీవితానికి సంబంధించిన విషయం. అయితే కళాకారుడు విషయాల్లోని సామాన్యగుణాల్ని కాకుండా విశిష్ట వైశిష్ట్యక

గుణాలను చూస్తాడు. విషయాన్ని వైయక్తీకరిస్తాడు (Individualisation of Phenomena అంటే అర్థం యిది). చెట్టులోని 'చెట్టుత్వం' కాదు కవికి కావలసింది విషాద కవితలో ఎండిపోయిన చెట్టును ప్రతీకగా వాడుతోంటే అది చెట్టు అనేకన్నా అది ఎండిపోయింది అన్నది కవికి ముఖ్యం. షెర్బినా మాటల అర్థం యిది. దీనికి జగత్తును ఆత్మీకృతం చేసుకోవడానికి సంబంధం ఏమిటి?

అయితే కేవలం షెర్బినాతో ఆగిపోతె మాస్కో కవులు భయపడతారేమో గాని ఇతరులు భయపడరు. కాబట్టి 'బహుముఖీన ప్రజ్ఞాశాలి, ద్రష్ట' అయిన లెనిన్ నుండి ఒక కొటేషన్ ఇచ్చారు. 'The universal exists only in the individual and through the individual' (పే. 62) ఇచ్చి, 'ఇలాంటి ఆత్మకూ జగత్తుకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని జాగృతం చేసుకోవడమే, ఇలాంటి అద్వైతస్థితిని పొందటమే, ఆత్మకళ' అని తేల్చారు. అసలు లెనిన్ వాక్యంలో Universal rndividual అంటే జగత్తు-ఆత్మ అనికాదు అర్థం. ఇది తాత్విక ప్రత్యయాల విశ్లేషణకు అతి మౌలికమైన విభజన. 'కుక్క' అనేది Universal, అంటే సార్వత్రికమయిన ప్రత్యయం. ఫలానా కుక్క Individual - వ్యక్తి- 'మనిషి' Universal. శేషేంద్ర ఈ మనిషి అనే సార్వత్రిక ప్రత్యయం తాలూకు వైయక్తిక రూపం. అక్కడ లెనిన్ ఏమంటున్నాడంటే మనిషి, కుక్క, చెట్టు మొదలయిన సార్వత్రికాలు ఎక్కడో స్వతంత్రంగా వుండవు. ఫలానా మనిషి, ఫలానా కుక్క, ఫలానా చెట్టు అనే వైయక్తికాల రూపంలోనే వుంటాయి అంటున్నాడు. ఇది తత్వశాస్త్రానికి చాల ప్రధానమయిన విషయం. తాత్వికులు అనాదిగా ఎరిగిన విషయం, లెనిన్ కనిపెట్టిందికాదు. ఈ విషయమే చెప్పదల్చుకున్నా లెనిన్‌ను కోట్ చేయాల్సిన అవసరంలేదు. (రాడికల్ ప్రెస్టేజ్ కోసం కాకపోతే) అంతకంటె ముఖ్యంగా, దానికీ "ఆత్మకూ వున్న అవినాభావ సంబంధానికి" ఏ రకమయిన సంబంధం లేదు.

ఆత్మీకరణ (Internalisalisation) కు వైయక్తీకరణ (Indlvldunlisation)కు తేడా తెలీదు. జగత్తు (Universe) కు సార్వత్రికం (Universal)కు తేడా తెలీదు. ఈ మాత్రం ఆంగ్లపాండిత్యానికేనా తెలుగు దేశంలో కమ్యూనిస్టులు ప్రజల్ని ఇంగ్లీష్ చదువుకోవద్దంటున్నారని గోలపెడుతున్నారు?

వేరే సందర్భాలలో గూడ ఈ రకమయిన వక్రవ్యాఖ్యానాలు చేసారు. ఒక సోవియట్ రచయిత, 'While emphasising the interdependence subsisting between art and other forms of social consciousness.... Marxist-Leninist aesthetics notes simultaneously the relative independence of art' అనంటే "మార్క్సిస్టు సాహిత్య దృక్పథం సౌందర్య శాస్త్రాన్ని కళా స్వతంత్ర ప్రక్రియలుగా పరిగణిస్తుంది" అన్న తమ తీర్మానానికి దాన్ని సమర్థింపుగా వాడుకున్నారు. పైగా "సర్వులూ దీన్ని ముఖ్యంగా గుర్తించాలి" అన్నారు. ఏమిటి సర్వులూ గుర్తించాల్సింది? - 'Relative' అన్న పదానికి "సంపూర్ణం" అన్న కొత్త అర్థాన్నా? అయినా, తాము చెప్పదలచుకున్నదేమిటో, తమ దృక్పథం ఏమిటో స్వంతమాటలలో చెప్పుకోవచ్చుగా—ఈ అరువు కొటేషన్ల వక్రవ్యాఖ్యానాల వ్యాపారం దేనికి?

## సాహిత్యం - ప్రచారం

సాహిత్యంలో ప్రచారం, శిల్పం, శబ్దం మొదలయిన చాల విషయాలగురించి చర్చించారు. తమ దృక్పథమే మార్క్సిస్టు దృక్పథమని చూపడానికి లూనషార్స్కీని మయకోవస్కీని చాల విరివిగా వాడుకున్నారు. (వాళ్ళను 'లూనా' 'మాయా' అని ముద్దుపేర్లుపెట్టి మరీ వాడుకున్నారు.) ఈ విషయాలన్నింటినీ వివరంగా చర్చించడం యిక్కడ సాధ్యపడదు, అనవసరం గూడ. వీటికి సంబంధించి మార్క్సిస్టు అవగాహన ఏమిటో లూనషార్స్కీ తన Theses on the Problems of Marxist Criticism అనే వ్యాసంలో స్పష్టంచేసాడు. ఒక్క ప్రచారం సంగతి మాత్రం ఇక్కడ చూద్దాం.

సామాజిక చైతన్యమంటే నిర్దిష్ట భౌతిక స్వరూపంగల సమాజం తన్ను తాను దర్శించుకునే విధం అని చూసాం. ఈ దర్శనానికి సాధనాలు వివిధ సామాజిక చైతన్య రూపాలు (Forms of social consciousness) సాహిత్యం, రాజకీయం, మతం మొదలయినవి. ఇక్కడే వీటికి గల ప్రత్యేకత, ఆ ప్రత్యేకత యొక్క పరిమితులు అన్నీ వున్నాయి. సాహిత్యం రాజకీయం విభిన్న సామాజిక చైతన్య రూపాలు కాబట్టే సాహిత్యంలో "అనాచ్ఛాదితమైన ప్రచారం" ఉండకూడదని

ప్లెఖనోవ్ అన్నాడు. రచయిత తన అభిప్రాయాన్ని ప్రత్యక్షంగా కాకుండ పరోక్షంగా చెప్పాలని ఎంగెల్సు అన్నాడు. కాని "ప్రచారం" అంటే ఏమిటి అభిప్రాయాలను ప్రత్యక్షంగా చెప్పడం అంటే ఏమిటి, అన్నది గూడ దృక్పథాన్ని అనుసరించి మారుతుంది. దృక్పథం మారితే మాటల అర్థం గూడా మారుతుంది. ఈ మధ్య ఒక కవి-

దొరల గద్దె దించె దాక-
దరలు తగ్గేటట్టు లేవు

అన్నాడు. ఇది ప్రచారమా కవిత్వమా? ఇక్కడ అనాచ్ఛాదితమైన ప్రచారం వుందని ప్లెఖనోవ్ అభ్యంతరం చెప్పేవాడా? ఎంగెల్సు ఇక్కడ కవి [illegible] బాహాటంగా దొరల గద్దెదించమన్నాడనీ, ఇట్లా ప్రత్యక్షంగా కాకుండ "సంస్కారవంతులకు" గాని అర్థంగాని పద్ధతిలో "ఊహాభుజార్గళముల్ విప్పిన విశ్వమూర్తులయి శంఖారావముస్ యిడదో దళిత శ్రామిక జీవులార భువనద్వారంబు భేదిల్లగన్" (పే. ౨౫౭) అనుండెననేవాడా? "దళిత శ్రామిక జీవులకు" మత్తేభంలో ఉపదేశించడం కవిసేనకు చెల్లుగాని దాని గురించి ఏమనేవాడో వివరించాల్సిన పనిలేదు.

ఇక్కడొక విషయం చెప్పాలి. ప్రజాసాహిత్యం అంటే ఏమిటన్న విషయం చాల క్లిష్టమయింది. అది లూనషార్స్కీగాని మయకోవ్‌స్కీగాని తేల్చి పారేసేది కాదు. బౌద్ధిక శ్రమకు భౌతిక శ్రమకు గల భేదం పోయేంతవరకు సాహిత్యకారులెక్కువగా బౌద్ధిక శ్రమచేసే వర్గం నుండి వచ్చేవారే కాబట్టి ప్రజాసాహిత్యాన్ని గూర్చి చర్చ, అన్వేషణ సాగుతూనే వుంటాయి. ప్రతితరం ఆ చర్చ తత్కాల పరిస్థితుల ననుసరించి కొనసాగించాలి. అంతేగాని మయకోవ్‌స్కీ రొమాంటిక్ కవిత రాస్తే అది ప్రజాసాహిత్యమయి పోదు (మార్క్సుగూడ విద్యార్థిగా వున్న రోజుల్లో ప్రేమకవిత్వం రాసాడు. శేషేంద్రకీ విషయం తెలిసినట్టులేదు. తెలిసుంటే ఇంతెంత రభస చేసేవారో - చూసారా యీ దొంగ కమ్యూనిస్టులు మన విద్యార్థులకు ప్రేమ కవిత్వం రాయొద్దని చెబుతున్నారంటూ.)

## శాస్త్రీయ దృక్పథం

'వైజ్ఞానిక ఉద్యమం' నడపదలచుకున్నవారికి కనీస శాస్త్రీయ దృక్పథం ఉండాలి. చైతన్యం ఆత్మసంభూతం కాదని, అది పదార్థంనుండి పుడుతుందని తెలియాలి.

సాహిత్యానికి సమాజానికి గల సంబంధాన్ని చర్చిస్తూ శేషేంద్ర తనకి కనీస శాస్త్రీయ దృక్పథం లేదని నిరూపించుకున్నారు. 'సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది' అన్న వాక్యాన్ని ఒక ఆజ్ఞగా అర్థంచేసుకొని దాన్ని ఖండించడానికి చాలా ప్రయాసపడ్డారు. అసలర్థం అదికాదు. జాలర్ల పాటను జాలర్ల భాషలో రాసి వారి బాణీలోనే పాడితే అది వారి జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. అదే పాటను ఎవ్వరూ అంటని ఎవ్వరూ ముట్టని పదజాలంతో రాసి (ఇలా రాయడం కవిసేన ఆశయాలలో ఒకటి) త్యాగయ్య గూడ ఎరగని రాగంలో ఆలపిస్తే అదిగూడ సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. జాలర్ల జీవితాన్ని కాదు; అభ్యుదయం ఆశయం, అన్నీ కోల్పోయి కేవలం చాపల్యం మాత్రం మిగిలిన మన పాలకవర్గాలను ప్రతిబింబిస్తుంది. అదే పాటను అధివాస్తవిక పద్ధతిలో రాస్తే అప్పుడు గూడ అది మన సమాజానికి అద్దం పడుతుంది. పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానంతోబాటు సామ్రాజ్యవాద సంస్కృతిని గూడ దిగుమతి చేసుకునే మన అర్ధవలస వ్యవస్థను చూపిస్తుంది.

కాబట్టి సాహిత్యం సమాజానికి ప్రతిబింబమంటే అది విజ్ఞప్తికాదు, విధేయత కాదు, ఆజ్ఞ అంతకంటె కాదు. అది సామాజిక జీవితానికి సంబంధించిన ఒక సత్యం. బహదూర్ షా జఫర్ నూరేళ్ళ ఆయుస్సు అడిగితే నాలుగురోజులు దొరికాయి, అందులో రెండు కోర్కెల్లో గడిచాయి, రెండు నిరీక్షణలో అంటే అందులో చూడవలసింది కేవలం "అనుభూతి యిచ్చిన వక్రోక్తి" కాదు, అది పతనమవుతున్న భూస్వామ్య సమాజపు పాలకవర్గాల నోటి నుండి వచ్చిన మాటగా గుర్తించాలి. ఆ పతనం జఫర్‌తో మొదలుకాలేదని ఈ నాటికీ అంతం కాలేదనీ తెలిస్తే అప్పటి నుండి నిన్న మొన్న "గుజర్ గయావో జమానా...." అంటూ శోకించిన పంకజ్ మల్లిక్ వరకూ ఉర్దూ, హిందీ సాహిత్యంలోకాల్ని ఏలుతున్న సంస్కృతి యేమిటో

ఆ సాహిత్య మంటే అంత మక్కువ ఉన్న తన దృక్పథమెటువంటిదో గ్రహించే వారు.

ఈ మానిఫెస్టోకు ఉపోద్ఘాతంగా తాను చెప్పిన మాటల్లో శేషేంద్ర ఒకచోట "ఈనాడు చరిత్రలో మనిషి ఎక్కడున్నాడన్న స్పృహలేనివాడు ఆధునిక కవిగాని మరొకటిగాని ఎట్లా అవుతాడు?" కాని ఏది మీ అవగాహన? ఏది మీ చారిత్రక మానవుడు? ఎక్కడిదాక వచ్చాడు? అసలు మానవుడనే వాడు లేడని చారిత్రక మానవుడే వున్నాడని అర్థం అయివుంటే, వ్యవస్థల తాలూకు వాసన వుంటుందని తెలిసి వుంటె "వ్యక్తి" అనడానికి బదులు "ఆత్మ" అని, "అధ్యయనం" అనడానికిబదులు "తపస్సు" అని, "వర్తమాన సామాజిక వ్యవస్థ"ను "విధి" అని అనడం జరిగి వుండేదా? "ధర్మార్థ కామమోక్షాలను కవిసేన సోషలిస్టు సమాజ తత్వాంశాలుగా వ్యాఖ్యానిస్తాం"దనడం జరిగివుండేదా? భాష సమాజంలో పుడుతుంది. ఆ సమాజం స్వరూపం భాషలో నిక్షిప్తమయి వుంటుంది. సామాజిక వ్యవస్థమారితే మాటలకు అర్థం గూడ మారుతుంది. ఒకప్పుడు సామంతుడంటే ప్రక్కదేశం రాజన్న అర్థం వుండేది. ఒక ప్రాంతంలోని రాజులందరినీ ఒకడు లోబరచుకొని తన రాజ్యాన్ని విస్తరించుకోడం ద్వారా మనదేశంలో ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాణం జరిగింది కాబట్టి ఫ్యూడల్ కాలం నుండి (దాదాపుగా గుప్తరాజుల కాలం నుండి) సామంతుడంటే ఒక చక్రవర్తికిగాని రాజుకు గాని కప్పం గట్టుకునే సంస్థానాధిపతి అని అర్థం వచ్చింది. వ్యవస్థ మారడంతోపాటు మాటకు అర్థం గూడ మారింది. అయితే ఇది చరిత్రక్రమంలోనే సహజంగా జరగాలి అంతేగాని బలవంతంగా అర్థ విముక్తి నేను మోక్షం అంటాననడం మూర్ఖత్వం. చరిత్రతో పరాచికాలాడే హక్కు ఎవరికీ లేదు.

మానిఫెస్టో 323వ పేజీ నుంచి 352 వ పేజీవరకు శేషేంద్ర తన చారిత్రక దృక్పథం ఏమిటో వివరించారు.

ఈ పుస్తకానికి అసలు ఉపోద్ఘాతం అనే_అంటకు ముందిచ్చిన లెవిస్ కొటేషన్లు ఇ.ఎ రిచర్డ్సు కొటేషన్లు దేనికి ముసుగో తెలియాలంటె ముందు ఈ వివరణ చదవాలి. సమాజాన్ని వ్యాఖ్యానించడానికి ఆదిమ విజ్ఞానులు చేసిన మహోద్య

మంలో వేదము పురాణము కావ్యము అనేవి మూడు శాఖలు. మానవులందరి లక్ష్యం ధర్మార్థకామమోక్షాలు అని నిర్దేశించబడ్డాయి, వగైరా వగైరా. చరిత్ర కవిసేన వంటి సంస్థకాదు. నలుగురు గడ్డాల మునుల కార్యనిర్వాహక వర్గం దాన్ని వ్యవస్థీకరించడానికి, ఈ రకమయిన తద్దినపు బ్రాహ్మడి విజ్ఞానమా కవిసేన నడపటోయే వైజ్ఞానిక ఉద్యమానికి ప్రాతిపదిక? ధర్మార్థకామ మోక్షాలనేవి మనదేశ భూస్వామ్య వ్యవస్థ భావజాలంలో అతి ముఖ్యమయిన భాగం, అది "సమాజ లక్ష్యం" ఏరోజూ కాదు. "ధర్మం" అంటే వర్ణవ్యవస్థను నిలబెట్టేది. అది శూద్రుల లక్ష్యం, పంచముల లక్ష్యం కావడానికి ఆస్కారం గూడ లేదు. అందుకే ధర్మవర్తనకు ప్రతిఫలంగా మోక్షం అవసరమయింది. ఎంతటి భూస్వామ్య వ్యవస్థ అయినా అందులో కొంత అమ్మకపు సరుకుల ఉత్పత్తి మారకం వుంటాయి. కాబట్టి ఎప్పుడూ ఒక వర్తక వర్గం వుంటుంది. ఇది పాలకవర్గాలకు అతి సన్నిహితంగా వుంటుంది. అందుకే "అర్థం" ప్రధానం. ఇక "కామం" మాటకొస్తే, తమ విలాసాలకోసమే సదా పాలక వర్గాలు యిన్నిపాట్లు పడేది.

పురాణాలు కూడ ఈ భావజాలంలో ఒక భాగం మాత్రమే. ఇవి పురాణర్షులు ప్రజల్ని "బుజ్జగించడానికి" రాసినవికావు. ఆర్యేతర తెగల్లో వర్గ సమాజం ఏర్పడడానికి, స్థిర వ్యవసాయం, స్వయంసమృద్ధ గ్రామీణ వ్యవస్థ, భూస్వామ్యం ఏర్పడడానికి వర్ణవ్యవస్థతోబాటు పురాణాలు గూడ చాలా తోడ్పడ్డాయి. హైందవేతర ప్రజలను (తెగలను) హైందవసమాజం (అంటే, పురాణాలకాలానికి, స్థిర వ్యవసాయం మీద ఆధారపడ్డ వర్గ సమాజం)లో కలుపుకోవడానికి, ఆ తెగల్లో గూడ స్థిర వ్యవసాయం వర్గ విభజన ఏర్పడడానికి, వారి దేవుళ్ళను దేవతలను హిందూ దేవుళ్ళుగా అంగీకరించడం– ఇది చారిత్రకంగా పురాణాలు నిర్వహించిన పాత్ర, అంతేగాని ప్రజల్ని "బుజ్జగించడం" కాదు.

అయినా యిదంతా కొత్తేంగాదు. మనదేశ భూస్వామ్య సంస్కృతి దృక్పథాన్ని సంరక్షించడానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత మేధావులు, భారతీయ విద్యాభవన్ వంటి సంస్థలు చేసిన కృషి అందరూ ఎరిగినదే. రాధాకృష్ణన్

అధ్యక్షతన "భవన్" వారు భారతదేశ సాంస్కృతిక వారసత్వం అనే నాలుగు వాల్యూముల మూడువేల పేజీల ఉద్గ్రంథం ప్రకటించారు. దాన్ని భారత భాషల్లోకి అనువదించడానికి అనుమతి గూడ మన ఫ్యూడల్ - వ్యతిరేక ఇందిరా గాంధి ప్రభుత్వం యిచ్చినట్లు వినికిడి. ఆ గ్రంథంలో లేనిది కవిసేన దృక్పథంలో కొత్తగా ఏం లేదు. మరయితే ఈ నూతన ప్రయత్నం ఎందుకు చేస్తున్నట్లు? ఎందుకంటే రాధాకృష్ణన్‌గాని, "భవన్"గాని మార్క్సిస్టు ముసుగు వేసుకోలేదు. ఆ ముసుగు వేసుకొని రివిజనిస్టుల రాజకీయ వ్యాపారంతో విసిగిపోయిన యువతరాన్ని ప్రజల నుండి రక్షించడానికి కవిసేన పుట్టింది.

సృజన, సెప్టెంబర్ 1981